# ఆలయాలకు నిధులు అందజేయాలి


పూజలు నిర్వహిస్తున్న గాజుల అంజయ్య, రాకేష్ తివారి, మధుసూదన్ యాదవ్

చార్మినార్: ఆషాఢ మాసం బోనాలు ఈ ఆదివారంతో ముగిసినప్పటికీ కొన్ని ఆలయాలకు దేవాదాయ శాఖ నుంచి ఆర్థిక సాయం ఇంకా అందజేయకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. ఆదివారం డబుల్ బెడ్ రూమ్‌లోని ముత్యాలమ్మ అమ్మవారికి స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..కొన్నేళ్లుగా కొత్త ఆలయాలకు ఆర్థిక సాయం అందడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఆర్థిక సాయం అందజేయలేదన్నారు. ఈసారైనా కొత్తగా ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతూ ఇప్పటికే ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరఫున వినతి పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేష్ తివారి, ప్రస్తుత ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్‌తో పాటు టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# 'భారత రాజ్యాంగం సంక్షిప్తం' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ రాధారాణి చిత్రంలో దేవేందర్ గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో భారత రాజ్యాంగం సంక్షిప్తం అనే గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. మాజీ హోంమంత్రి బీసీసీఈ చైర్మన్ టి.దేవేందర్‌గౌడ్ రూపొందించిన భారత రాజ్యాంగం సంక్షిప్తం అనే గ్రంథాన్ని తెలంగాణ హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ..భారత రాజ్యాంగంపై ప్రతి పౌరునికి అవగాహన ఉండాలన్నారు. అందరి అందుబాటులో ఉండేలా భారత రాజ్యాంగాన్ని సంక్షిప్తంగా రూపొందించి ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, ఢిల్లీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు తిరుమలి, నల్ల సూర్యప్రకాష్, పాశం యాదగిరి, ఇంద్రవెల్లి రమేష్ పాల్గొన్నారు.

## ఆర్ట్ ఆఫ్ సర్వైవల్, సేవకుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



బహదూర్‌పురా: ఆర్ట్ ఆఫ్ సర్వైవల్, సేవకుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లీవింగ్ హోప్ మినిస్ట్రీ ప్రెసిడెంట్ పి.ఆనంద్‌కుమార్, ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ చార్మినార్ డివిజన్ ప్రెసిడెంట్ బుర్రగల్ల ఆనందం ఆదివారం కోరారు. ఫలక్‌నుమాలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 5న ఫలక్‌నుమాలోని బీస్ట్రిఫ్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఆర్ట్ ఆఫ్ సర్వైవల్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా హైదరాబాద్ సీయోను ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ మోహన్ బాబు, హీల్ టెంపుల్ చర్చ్ రెవరెండ్ ప్రసాద్ చౌదరి, న్యూజెరుసలేం మినిస్ట్రీ బిషప్ ధన్‌రాజ్ కోటాతో పాటు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పాల్గొంటారన్నారు.


కిట్లను పంపిణీ చేస్తున్న ఆదర్ల మహేశ్

## క్రీడాకారులకు కిట్ల పంపిణీ

గౌలిపురా: ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటున్న టగ్-ఆఫ్-వార్ క్రీడాకారులకు ఆదివారం గౌలిపురాలోని ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టగ్-ఆఫ్-వార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ పాల్గొని క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. 26వ సబ్ జూనియర్, 37వ జూనియర్, 37వ సీనియర్ ఉమెన్ నేషనల్ టగ్-ఆఫ్-వార్ చాంపియన్‌షిప్‌లు ఆగ్రాలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నట్లు పోటీల్లో తెలంగాణ నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. క్రీడాకారులు విజయోత్సవంతో తిరిగి రావాలని ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.బ్రహ్మానందం, మేనేజర్ బి.జానకీరామ్, ఇన్‌చార్జి కె.దేవేందర్ గౌడ్, జె.అశోక్, కొడి సురేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా స్నేహితుల దినోత్సవం


స్నేహితులతో మహ్మద్ నజీబ్

అబిడ్స్: భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదివారం బీవైఎస్ ఇందిరాపార్క్-2 సభ్యులు ఈ వేడుకలను సంతోషంగా, ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను, స్నేహితులతో ఉండే స్నేహానుభావాలను గుర్తుచేసుకున్నారు. ఈ వేడుకల్లో ప్రధాన శిక్షకురాలు లతా, యోగా సభ్యులు డీఈ శ్రీహరి, బాలాజీ, నరేందర్, స్వరూప పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం..**

గోల్కొండ: తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలంగాణ ఫ్యామిలి కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా తన చిరకాల మిత్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి తాము స్నేహితులమని, వివిధ రంగాల్లో స్థిరపడ్డామన్నారు. 15 ఏళ్లుగా సొంత నిధులతో అనాథలు, నిరుపేదలకు చేయూతనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఖలేద్ అలీఖాన్, మహ్మమద్ ముజీబ్ తదితరులు ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న బీవైఎస్ సభ్యులు

# దోపిడీ ముఠా రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

గోల్కొండ: వాహనదారులను కత్తులతో బెదిరించి దోచుకుంటున్న ఓ ముఠాను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొహమద్ ఎజాజ్ ఖురేషి(22) బజార్‌ఘాట్‌లో బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. అందులో వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడానికి పథకం పన్నాడు. ఇందుకు అతను మల్లేపల్లికి చెందిన సొహెల్ ఫర్దీన్ ఖాన్(21), పీఎస్ నగర్‌కు చెందిన నీరటి ప్రశాంత్(22), హుమయూన్ నగర్ కోటమ్మబస్తీకి చెందిన సాయి(22), విజయనగర్ కాలనీకి చెందిన రాజశేఖర్(26), ఆసిఫ్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ ఖలీల్(22), విజయనగర్ కాలనీకి చెందిన అభిలాష్‌తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. వీరికి జతగా ఓ బాలుడు కూడా ఉన్నాడు. పథకం ప్రకారం వీరంతా హుమయూన్‌నగర్‌లోని మెడ్‌ప్లస్ మెడికల్ హాల్ వద్ద ఈ నెల 3వ తేదీన రాత్రి 7గంటలకు కారులో కాపుకాశారు. ఆ సమయంలో ఎం.శ్రీమంత్‌కుమార్ తన స్విఫ్ట్ కారులో ఆసిఫ్‌నగర్ వైపు వెళ్తున్నారు. నిందితులు అతనికి కత్తి చూపి కారు ఆపారు. వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, బంగారు చైన్, ఉంగరం తీసుకొని పరారయ్యారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నిందితుల కోసం గాలించారు. వీరిని ఆదివారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి ఐఫోన్, బంగారు గొలుసు, కత్తి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఖురేషి, ఫర్దీన్, ప్రశాంత్‌పై వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆస్తులు కాజేసిన కేసులు ఉన్నాయి.

# బోనం..వైభవం


ఉత్సాహంగా ఆడుతున్న ఈఓ శ్రీనివాస్‌రాజు


పూజల్లో చైర్మన్ కాంత అరవింద్


చివరి పూజల్లో పనివృత్తివారితో..


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీనివాసరాజు


బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి గుర్రం శివశంకర్‌ను సన్మానిస్తున్న ప్రవీణ్, నవీన్


ఇమాంపురా తొట్టెల ఊరేగింపులో ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ


గావు కార్యక్రమం

గోల్కొండ/లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ అమ్మవారి ఆషాఢ మాస బోనాల చివరి పూజ భక్తిశ్రద్ధలతో ముగిసింది. దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాస్‌రాజు పదవీ కాలం ముగియనుండటంతో ఆయనను ఘనంగా సన్మానించి, ఆయన గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయం అభివృద్ధికి చేసిన కృషిని పనివృత్తివారు, నాయకులు కొనియాడారు. అందరినీ ఉత్సాహపరుస్తూ ఈఓ అందరితో కలిసి ఆడుతూ అమ్మవారి చివరి పూజలు నిర్వహించారు. చివరి రోజు బలి గంప, పోతరాజు గావు, మహా కుంభహారతి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్, చంటిబాబు, సాయిబాబా చారి తదితరులు పాల్గొన్నారు.

**జియాగూడలో..**

జియాగూడ: ఇమాంపురాలో నవభారత్‌సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో పురానాపూల్ చౌరస్తా నుంచి తొట్టెల ఊరేగింపు రేణుకామాత ఆలయానికి చేరుకుంది. అనంతరం బస్తీవాసులు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, మహేష్‌బాబు, జశ్వంత్ కుమార్, సంతోష్‌కుమార్, బాలకిషన్, లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నవోదయనగర్‌లో కట్టమైసమ్మ మారు బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం, చింతోల ప్రవీణ్, నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అతిథిగా హాజరైన జియాగూడ బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గుర్రం శివశంకర్, సీనియర్ బీజేపీ నాయకులు మాణిక్ ప్రభులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు.

## ప్రజల సహకారంతో బోనాలు విజయవంతం


మైత్రీకమిటీ సభ్యులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: ప్రజలు, మైత్రీ కమిటీ సభ్యుల సహకారంతో గోల్కొండ బోనాలు విజయవంతమయ్యాయని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ కోట 9వ బోనం పూజ సందర్భంగా మైత్రి కమిటీ సభ్యులతో కలిసి ఆయన గోల్కొండ ప్రధాన రహదారుల్లో ఆదివారం పర్యటించారు. ఏసీపీ మాట్లాడుతూ.. గోల్కొండ కోటలో జరిగే బోనాలు, బందోబస్తును ప్రజల సహకారంతో విజయవంతం చేశామన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీల్లో యువకులు, మహిళలు చురుగ్గా పని చేస్తున్నారన్నారు. ఆబిద్, ఎలీయస్ అక్బర్, మీర్జా ఎక్బాల్ హైమద్ తదితరులు ఉన్నారు.

## రంగ మార్తాండ సినిమాకు అవార్డులు రావడం సంతోషం

గన్‌ఫౌండ్రీ: రంగ మార్తాండ సినిమా క్రెడిట్ మొత్తం దర్శకుడు కృష్ణవంశీకే చెందుతుందని నిర్మాత కాలీపు మధు తెలిపారు. 69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డులను రంగ మార్తాండ సినిమాకు రెండు అవార్డ్స్ రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం రవీంద్రభారతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ సినిమా రెండు అవార్డులను దక్కించుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో సుమంత్ హీరోగా మహేంద్రగిరికి వారాహీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు వెల్లడించారు. తన చివరి శ్వాస వరకు ప్రేక్షకులకు మంచి సినిమాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## ఒడిబియ్యంతో అమ్మవారి మహా ప్రసాదం



డబీర్‌పురా: డబీర్‌పురాలోని ఏడు గుళ్ల జగదాంబ ఆలయంలో ఆదివారం ఒడిబియ్యంతో అమ్మవారి మహా ప్రసాదంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శంషీర్‌గంజ్ రోడ్డు విస్తరణ చేయాలి


వెంకటరమణ

చాంద్రాయణగుట్ట: సయ్యద్ అలీ చబుత్రా నుంచి శంషీర్ గంజ్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్న వెంకటరమణ కోరారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఈ సమస్య విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు. సయ్యద్ అలీ చబుత్రాలోని షాగౌజ్ హోటల్ నుంచి శంషీర్‌గంజ్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. 30 ఏళ్ల నుంచి ప్రతిపాదనలు తప్పా విస్తరణకు ముందుకు రావడం లేదన్నారు. గత కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు విన్నవిస్తే, ఆయన స్వయంగా పరిశీలించి వెంటనే విస్తరిస్తామని చెప్పిన హామీ నెరవేరలేదన్నారు.

## వాహనంతో ఢీకొట్టి..ఆపై దాడి

విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని వాహనంతో ఢీకొట్టి క్షతగాత్రుడిపై దాడిచేసిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివసించే అమీర్‌ఖాన్ (26), భార్య ఇద్దరు సంతానంతో కలిసి జిర్రాలో ఉంటూ ఫర్నిచర్ పనులు చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం భార్యతో గొడవపడి ఆమెను కొట్టినట్లు సమాచారం. శనివారం రాత్రి 10.30 సమయంలో చంద్రభవన్ చౌరస్తా ప్రాంతంలో మద్యం తాగి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనంతో ఢీకొట్టి అతడిపై పిడిగుద్దులు కురిపించడంతో చెవిలో నుంచి రక్తం కారుతూ అక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అమీర్‌ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం తన భార్యతో గొడవపడిన విషయాన్ని మనసులో ఉంచుకుని తన అత్తింటివారు అతడిపై దాడి చేసినట్లు పోలీసులకు అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ప్రతినిధులు

జియాగూడ: ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ అమావాస్య అన్నప్రసాద కార్యక్రమం ఆదివారం ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి కార్వాన్ నందు గోపోషణ కార్యక్రమం, గోవులకు గ్రాసం సమర్పించడం జరిగింది. ప్రతినెల అమావాస్య రోజు అమావాస్య అన్నప్రసాదం, గోపోషణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుండా సురేష్, జై యాదగిరి, సీహెచ్.గోవింద్, కార్యక్రమం చైర్మన్ జాల్‌వాడి ధనుంజయ గుప్తా, ఐవీపీ మాజీ అధ్యక్షుడు యాద శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, ఉడత శ్రీనివాస్, కూర జయరాములు, ఆకారం శ్రీనివాస్, టి.బాల్‌రాజ్, బి.భాస్కర్, నీల కృష్ణ, బానూరి నర్సిములు, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## సమాజ సేవకే నవభారత్ అసోసియేషన్ అంకితం



వేడుకల్లో చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్ గైక్వాడ్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకే నవభారత్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అంకితమని అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు మనోహర్ గైక్వాడ్‌లు పేర్కొన్నారు. అసోసియేషన్ 25 సంవత్సరాల వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ..25 ఏళ్లుగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి, ప్రజాభివృద్ధికి అసోసియేషన్ అంకితమవుతుందన్నారు. స్థానిక బస్తీల సమస్యలు అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శౌరాజ్ సింగ్, శ్రీశైలం, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గోశాలల్లో అమావాస్య పూజలు



అఫ్జల్‌గంజ్: గోశాలల్లో అమావాస్య వేడుకలు నిర్వహించారు. ఆదివారం బేగంబజార్ అఫ్జల్‌గంజ్, ఇమ్లిబన్ గోశాలల్లో గో భక్తులు గోవులకు ఆకుకూరలు, గడ్డి, క్యారెట్, కీరా, బెల్లం, శనిగలు, ఇతర పదార్థాలు తినిపించి గోపూజలు చేశారు. ఇమ్లిబన్ గోశాలలో బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. గో సంరక్షణకు, గోవధ నిషేధానికి బజరంగ్‌సేనా ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రజని, శ్రీరామోజీ, ఎర్రం శ్రీనివాస్, సునీల్ అగర్వాల్, అరుణ్‌సింగ్, కాజల్‌కుశ్వ, కరణ్, నరేష్, ఆశీష్, అస్మిత్ అగర్వాల్ పాల్గొన్నారు.

## సన్మానం



యాకుత్‌పురా: ఇటీవల ఒడిశా ప్రభుత్వం 40 ఏళ్ల పైబడిన వారికి నిర్వహించిన జాతీయ కత్తి సాము పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించిన మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు ఎస్.నవీన్‌ను ఆదివారం నగర ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

## అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి మారు బోనం


మారు బోనం సమర్పిస్తున్న కృష్ణ కుంటుబ సభ్యులు

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో అమ్మవారికి మారు బోనం సమర్పించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణ కుంటుబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జగన్మోహన్, రాజారత్నం, దత్తత్రేయ, సతీష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న అష్టావధానం


మురళీకి పురస్కారం అందజేస్తున్న వక్తలు

గన్‌ఫౌండ్రీ: పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.ప్రకాశరావు 81వ జయంతి వేడుకలను ఆశావాది సాహితీ కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శతావధాని ఆముదాల మురళీకి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయగా బొరెల్లి హర్ష, అష్టావధానం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్తలు చింతా రామకృష్ణ, శ్రీధర్‌రావు, కె.సాగర్‌రావు, ఆచార్య ఫణీంద్ర, ఆత్రేయ శర్మ, లక్ష్మీ మానస, ఆశావాది సుధామ తదితరులు పాల్గొన్నారు.

# 'తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు మార్చవద్దు'



అఫ్జల్‌గంజ్: తెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును మార్చవద్దని ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర నాయకులు సంబు వెంకటరమణ, జూలూరు సత్యనారాయణ, బిల్లా కంటి రమేష్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు పేరును మారుస్తామని ప్రభుత్వం ప్రకటించడం విచారకమన్నారు. మద్రాస్ రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను తెలుగు భాష మాట్లాడేవారి కోసం అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు పేరును ఎట్టి పరిస్థితుల్లో మార్చనీయమని వారు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ..గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు లక్షలాది మంది ఆర్యవైశ్యులు ఎంతో కృషి చేశారన్నారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టిశ్రీరాములు పేరు ఉండే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరూ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని సంబు వెంకటరమణ, జూలూరు సత్యనారాయణ, బిల్లా కంటి రమేష్‌లు డిమాండ్ చేశారు.

# అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



గౌలిపురా: అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ అయ్యప్ప జేఏసీ నాయకులు బాలకృష్ణ, నాయిని బుచ్చిరెడ్డి, ప్రేమ్ గాంధీ, క్యాతం రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గౌలిపురాలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో తెలంగాణ అయ్యప్ప జేఏసీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల భద్రత, భరోసా బాధ్యత అనే అంశంపై అయ్యప్ప స్వాములతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..అయ్యప్ప మాలధారణ వేసిన వారికి ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో మాలధారణ వేసిన స్వాములను ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇది సరైంది కాదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయాలకు ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాములకు టోల్‌గేట్‌ల ద్వారా మండల, జ్యోతికి వెళ్లే స్వాములకు ప్రతి ఒక్క అయ్యప్ప స్వామికి రూ.10 వేలు అదనంగా టోల్‌గేట్ ఫీజులు వసూలు చేస్తున్నారని..వాటిని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. వివిధ నగరాల నుంచి శబరిమలైకు పాదయాత్ర ద్వారా వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు ఆయా దేవాలయాల వద్ద ఎండోమెంట్ ఆధ్వర్యంలో టాయిలెట్లు, విశ్రాంతి గదులు, భోజన వసతిని ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ ధర్మకర్తలు వి.ఎస్.గణేష్ గురుస్వామి, పాటిల్ సదానంద్ యాదవ్, బండారి విజయ్ కుమార్, డి.యశ్వంత్, మధు కుమార్, గోవర్దన్ గురుస్వామి, జమ్మిచెట్టు రాజు, కృష్ణ గురుస్వామిలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గురుస్వాములు పాల్గొన్నారు.

## పిలక్‌మాత ఆలయ చైర్మన్‌గా మహేందర్



డబీర్‌పురా: డబీర్‌పురా పిలక్‌మాత ఆలయ చైర్మన్‌గా రూప మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ..ఆషాఢ మాసం బోనాల అనంతరం శ్రావణమాసంలో ప్రతి ఏటా పిలక్‌మాత ఆలయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శ్రావణమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11, 12వ తేదీల్లో ఆలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 11న అమ్మవారికి బోనాల సమర్పణ, 12న అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 11 గంటలకు అన్నదానం, మధ్యాహ్నం 2 గంటలకు రంగం భవిష్యవాణి కార్యక్రమం, రాత్రి 7 గంటలకు ఘటాల ఊరేగింపు, బలిగంప కార్యక్రమాలు ఉంటాయన్నారు.